www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 23 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 8

## నేడు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు పూర్తికావడంతో నేడు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించను న్నారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ తో పాటు పలువురు ఎంఎల్‌ఏలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తవడంతో అశ్వాపురం మండలంతో పాటు పినపాక నియోజకవర్గ రైతాం గానికి సాగునీటి భరోసా మరింత బలోపేతం కానుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ తెలి పారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న సాగునీటి కల సాకారం అవుతున్న సందర్భంగా ప్రజలు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అరుదైన ఖనిజం.. అక్రమ తరలింపు..!



-మత్తులో మైనింగ్ శాఖ

-కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో అక్రమ తవ్వకాలు

-మంత్రి అనుచరులమంటూ కోట్ల దందా

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అరుదైన ఖనిజం దీని లభ్యత చాలా తక్కువ. దీనితో అక్రమ తవ్వకాల ద్వారా కొందరు కోట్లకు పడగలెత్తుతు న్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే ఈ అరుదైన ఖనిజ సంప దను అక్రమంగా తరలిస్తున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో జరుగుతున్న ఈ అక్రమ దందా విషయంలో ఎవరు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. అక్రమ తవ్వకాలను నిలువరించాల్సిన మైనింగ్ శాఖ మత్తులో జోగుతుంది. బెరైటీస్ ఖనిజం అరుదైనది, విలు వైనది. ఆంధ్రప్రదేశ్‌లోని కడపతో పాటు ఇప్పటి మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, ఖమ్మం అర్బన్ మండలాల్లో లభ్యమ వుతుంది. గార్లలో ఫారెస్టు భూముల్లో క్వారీలు

మిగతా 2లో..

# క్రీడలకు అధిక ప్రాధాన్యం

- ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు

- ముగిసిన ఐస్టా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్




**ప్రజాపక్షం/పాల్వంచ :** క్రీడాభివృద్ధికి, క్రీడాకారులను తయారు చేయటానికి ప్రాధాన్య తను ఇస్తున్నామని కొత్తగూడెం నియోజకవర్గాన్ని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ శ్రీనివాసకాలనీ మినీ స్టేడియంలో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నిర్వ హించిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ క్రీడలు ఐదవ రోజు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని విజేతలకు బహుమతులను అందజే శారు. అనంతరం ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెం ట్‌కు ఆతిథ్యం ఇచ్చిన శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ సురేష్‌రెడ్డికి, 75, 80 సంవత్సరాల వయసుతో క్రీడల్లో పాల్గొన్న సాయి రాంబాబు, భాస్కర్‌రావులకు ముందుగా అభినందనలు తెలిపారు. క్రీడలు మానసిక ఒత్తిడిని జయించడమే కాకుండా గెలవాలనే పట్టుదలను పెంచుతాయని, శారీరక దృఢత్వాన్ని, మానసిన ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో

మిగతా 2లో..

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి




-రబీ సీజన్‌కు పంటల ప్రణాళిక సిద్ధం చేయాలి

-విద్యుత్ అవసరాలకు పదేళ్ల ప్రణాళిక రూపొందించాలి

-ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల సమీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నియోజక వర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులతో ఖమ్మం నియోజక వర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువు లను నింపేలా చర్యలు చేపట్టాలన్నారు. బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా ఏఏ కాలువలకు అందించవచ్చో పరిశీ లించి అవసరమైన అంచనాలను సవరించి సమర్పించాల న్నారు. మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు 10ఎ మినహాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల పట్ల అధి కారులు నిర్లక్ష్య ధోరణిని మార్చుకోవా లని సూచించారు. సాగునీరు,

మిగతా 2లో..

# ఆర్‌అండ్‌బి అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా స్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులను తీవ్రస్థాయిలో హెచ్చరిం చారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను విస్మరిస్తే సంబంధిత కాంట్రాక్టర్ల బిల్లులను నిలిపివేయడంతో పాటు బ్లాక్‌లిస్టులో పెడతామని, విధు ల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏదులాపురంమున్సిపా లిటీపరిధిలోని 30వ వార్డులోని తరుణిహాట్‌లో నిర్మితమ

- ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతపై తీవ్ర అసంతృప్తి

- మరోసారి తనిఖీకి వస్తా ఆ లోగా నాణ్యతతో నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశం

వుతున్న ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ సముదాయాన్ని మంత్రి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీ లించిన ఆయన నాణ్యతా ప్రమాణాల్లో

మిగతా 2లో..

# అరుదైన ఖనిజం..అక్రమ తరలింపు..!

(మొదటిపేజీ తరువాయి)



ఉండడంతో తవ్వకాలను నిలిపి వేశారు. ఖమ్మం అర్బన్ మండలంలో బెరైటీస్ తవ్వకాలకు అనుమతులు పొందిన కొందరు తప్పుడు ఆధారాలతో అటవీ భూముల్లో తవ్వకాలు జరుపుతుండడంతో నిలిపివేశారు. కానీ ఖమ్మం కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఇప్పుడు యథేచ్చగా తవ్వకాలు జరుపుతున్నారు. కడప ప్రాంతానికి చెందిన ఇద్దరు, ఖమ్మం జిల్లాకు చెందిన మరికొందరితో కలిసి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ అరుదైన బెరైటీస్ ఖనిజాన్ని వెలికితీసి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రహస్య ప్రాంతాల నుంచి కడప, కోదాడ ప్రాంతాలకు బెరైటీస్ ఖనిజాన్ని తరలిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. కలెక్టరేట్‌కు సమీపంలో ఈ బెరైటీస్ తవ్వకాలు జరుపుతున్నప్పటికీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇంత విలువైన ఖనిజం ప్రభుత్వ అనుమతులు లేకుండా తరలిస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదంటే అక్రమ తరలింపుకు పాల్పడుతున్న వారు ఓ మంత్రి పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. అక్రమ తవ్వకాలు జరపడంతో పాటు గార్ల నుంచి కూడా బెరైటిస్ ఖనిజాన్ని దొంగతనంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రఘునాథపాలెం మండలంలో బెరైటీస్ లభించే ప్రాంతాన్ని వివిధ సంస్థలకు కేటాయించినప్పటికీ అక్కడి నుంచి కూడా రాత్రి వేళల్లో అక్రమ తవ్వకాలు చేపట్టి ఖనిజాన్ని తరలిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ మొత్తం అక్రమ తరలింపు వ్యవహారంపై గతంలో మైనింగ్ అధికారులు లారీలను నిలుపుదల చేయడంతో పాటు కొంత మందిపై కేసులు నమోదు చేశారు. వాస్తవానికి ఖమ్మం జిల్లాలో బెరైటీస్ తవ్వకాలకు సంబంధించి చింతకాని, కారేపల్లి మండలంలో ఒక్కో క్వారీ చొప్పున మాత్రమే అనుమతులు ఉన్నాయి. అనుమతులు లేకుండా ఖనిజాన్ని తరలిస్తూ కోట్లు కొల్లగొడుతున్న వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

**ఉదాసీన వైఖరిలో మైనింగ్ శాఖ :**

ఖమ్మం జిల్లా మైనింగ్ శాఖ ఉదాసీన వైఖరిలో ఉంది. ఎవరు అక్రమాలకు పాల్పడుతున్నారో వారికే మైనింగ్ శాఖ మద్దతు పలుకుతుంది. ఖమ్మంజిల్లాలో దశాబ్ద కాలంగా మైనింగ్ శాఖ మాముళ్ల మత్తులో జోగుతుండడంతో మట్టి అక్రమ తరలింపు యథేచ్చగా సాగుతుంది. గతంలో ఒకట్రెండు సందర్భాల్లో మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసే వారు. గడిచిన రెండేళ్లుగా మైనింగ్ శాఖ ఇసుక, మట్టి అక్రమ రవాణా వ్యవహారంలో చేష్టలూడిగి చూస్తుండిపోతుంది. బెరైటీస్ విషయంలో ఎందుకో ఆ వైపుకు కన్నెత్తి చూడడం లేదు. మైనింగ్ శాఖ ఉదాసీన వైఖరి కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. మంత్రుల పేరు చెప్పి వారి అనుచరులు మట్టి, బెరైటీస్ దందాలకు పాల్పడుతున్నారు. నిజంగా మంత్రుల మద్దతు ఉందో లేదో తెలియదు కానీ వారి ప్రధాన అనుచరులు అధికారులకు ఫోన్ చేసి హెచ్చరికలు జారీ చేస్తుండడం కూడా మైనింగ్ శాఖపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**(మొదటిపేజీ తరువాయి)** తాగునీటికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని మంత్రి తెలిపారు. గోదావరి జలాలను సక్రమంగా ప్రణాళిక చేసుకుని వినియోగించాలని ఒక ఎకరం పంట కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని మంత్రి సూచించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. రోడ్లపై ఎలాంటి ఆక్రమణలు ఉండకూడదన్నారు. కేబుల్ బ్రిడ్జి పనులకు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేసి నవంబర్‌లో హ్యాండోవర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హ్యామ్ రోడ్లలో ప్రస్తుతం మంజూరైన బలోపేత పనులు అవసరం లేదని నాలుగు లైన్ల రహదారి విస్తరణను ఇల్లందు వరకు చేపట్టేలా అంచనాలను సవరించాలని సూచించారు. మెడికల్ కళాశాల, హాస్టల్, అడ్మినిస్ట్రేషన్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. రబీ సీజన్‌కు వ్యవసాయ శాఖాధికారులు ఇప్పటి నుంచే పంటల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. నీటి లభ్యత, విద్యుత్ సరఫరాను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలన్నారు. సెప్టెంబర్ నెలాఖారులోగా రబీ సీజన్‌కు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులను అనుకూలంగా వినియోగించుకుని ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అర్హులైన లబ్దిదారులను వెంటనే ఎంపిక చేసి ఇండ్లు మంజూరు చేయాలన్నారు. వెలుగుమట్ల కాలనీలో అన్ని ఇండ్లను నవంబర్ 21లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దాలన్నారు. ఖమ్మం నగరానికి వచ్చే పదేళ్లలో అవసరమయ్యే విద్యుత్‌ను అంచనా వేసి సబ్ స్టేషన్లను ప్రణాళిక చేయాలన్నారు. విద్యుత్ కేబుళ్లతో పాటు ఇతర కేబుళ్లను భూగర్భంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేసి అవసరమైన పనులు చేపట్టాలన్నారు. షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని, హరిత భవన్‌కు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలన్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ హ్యామ్ రోడ్లకు సంబంధించి పలు పనులకు రూ.36.60 కోట్లు మంజూరు లభించిందని టెండర్ పూర్తయిందని నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ఖమ్మం నియోజక వర్గంలో ఏడు కొత్త సబ్ స్టేషన్లు ప్రతిపాదించామని వాటికి అవసరమైన భూమిని కేటాయించామన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే దిగువ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖమ్మం కార్పోరేషన్‌లో మంజూరైన 137 పనుల్లో 54 పనులు పూర్తయ్యాయని మరో 54 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ సమీక్షలో సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇల్లందులో అన్నదానం



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు 22వ వార్డు వినోబాబా కాలనీలో వినాయక ఉత్సవ కమిటీ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, పట్టణ సీఐ తాటిపాముల సురేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సందీప్ ముఖ్యఅతిథులుగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్, బస్తీ పేదలు ఆలేటి కిరణ్‌కుమార్, నాయని కృష్ణ, ఆలేటి చిన్ని, కొలపురి వేణు, బసిక కృష్ణ, తాండ్ర శ్రీను, నాయని విక్రమ్, బాలకృష్ణ, బోయిన సందీప్, శేఖర్, వికాస్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బి అధికారులపై
# మంత్రి పొంగులేటి ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)



లోపాలను గుర్తించి ఆర్‌అండ్‌బీ అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇకపై ఇలాంటి లోపాలు పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా , నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలతోనే పనులు చేపట్టాలని ఆదేశించారు. తాను మరోసారి స్వయంగా వచ్చి నిర్మాణ పనులను పరిశీలిస్తానని, అప్పటిలోపు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో స్ట్రక్చర్ నిర్మాణం జరగాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తదుపరి తనిఖీలోనూ నాణ్యతా లోపాలు కనిపిస్తే బాధ్యులపై చర్యలు తప్పవనే సంకేతాన్ని మంత్రి అధికారులకు ఇచ్చారు. అనంతరం 29వ వార్డులోని వినాయకుడిని దర్శించుకున్నారు. అలాగే అక్కడి డీపీఇపి పాఠశాలలో మొక్కను నాటరు. అనంతరం అక్కడి నుంచి ఖమ్మంరూరల్ మండలంలోని పలు వినాయకులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు అధిక ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)




క్రీడాకారులను తయారు చేసేందుకు కొత్తగూడెం నియోజక వర్గాన్ని క్రీడల హబ్‌గా తీర్చి దిద్దేందుకు పాటుతున్నామని చెప్పారు. శ్రీనివాస కాలనీ మిని స్టేడియం అభివృద్ధికి 70 లక్షల నిధులను, కొత్తగూడెంలో ప్రగతి మైదానంతో పాటుగా మరో స్టేడియం ఏర్పాటుకు 18 ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు. ఇండోర్ స్టేడియానికి ప్రయత్నాలు చేస్తున్నామని దీనిలో అన్ని సౌకార్యలను కల్పిస్తామని, పాల్వంచలోని ప్రతిష్టాత్మకమైన మన్‌మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీలో 60 ఎకరాల స్థలంలో ఇంటర్నేషనల్ క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పంధించారని తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచలో ఓపెన్ జిమ్‌లు, పార్క్‌లు ఉన్నచోట, చెరువుల దగ్గర వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటుకు బ్లూ ప్రింట్ తయారు చేశామని, కొద్ది రోజుల్లోనే పనులు మొదలు పెట్టనున్నామని తెలిపారు. దేశానికి క్రీడాకారులు అవసరమన్నారు. కొత్తగూడెం, పాల్వంచ నుండి సిఎం కప్‌లో విజేతలుగా నిలిచారని వారిని మరింత ప్రోత్సహిస్తే రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రేంచి స్ఫుర్తిని నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, చీఫ్ రిటైర్డ్ జడ్జి రామక్రిష్ణ, జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, డిప్యూటి చైర్మన్ సిరిపురపు లలితకుమారి, టిపిసిసి సభ్యులు నాగ సీతా రాములు, సిపిఐ నాయకులు డి. సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్‌గిరి, 45 డివిజన్ కార్పోరేటర్ దంతెబోయిన నరేష్, టెన్నిస్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి, కార్యదర్శి జకరయ్య, వై. వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఆటంకాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించే వినాయకుని దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ లు ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా తల్లాడ పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన లంబోదరుడిని వారు దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ గణనాధునికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్దలతో వైభవంగా నిర్వహించిన నవరాత్రోత్సవాలను అదే స్ఫూర్తితో ముగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు నంబూరు మోహన్‌రావు, వేమిశెట్టి నాగన్న, జవ్వాజి సుబ్బారావు, జవ్వాజి నర్సింహారావు, విష్ణు మోహన్‌రావు, కమిటీ సభ్యులు, మండల, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# గాంధీబాబుకు డాక్టరేట్

### -ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో పరిశోధన ప్రబంధానికి గుర్తింపు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం వెంగన్నపేట (గూడూరు) గ్రామానికి చెందిన డా॥ ఎస్. గాంధీబాబు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. A Disquisition and an Appraisal of the Selected Novels of Kiran Nagarkar" అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. గత 18 ఏళ్లుగా వివిధ ప్రాంతాల్లో ఉన్నత విద్యారంగంలో అధ్యాపకుడిగా సేవలందిస్తున్న గాంధీబాబు బోధనతో పాటు పరిశోధన, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, సాహిత్య అధ్యయనం, శిక్షణా కార్యక్రమాల ద్వారా విద్యా రంగంలో విశేష కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు లభించిన డాక్టరేట్‌ను తల్లిదండ్రులు శానంపూడి కనకరాజు, కమలమ్మలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఉన్నత విద్యా రంగంలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు పేర్కొన్నారు. గాంధీబాబును అభినందిస్తూ ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# చారిత్రిక ప్రదేశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** చారిత్రక ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి సూచించారు. మండల కేంద్రం లోని బౌద్ధక్షేత్రం వద్ద మంగళవారం పర్యాటక విశిష్టత గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యాటక ప్రాంతంగా జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విజేతలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**-జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం నిల్వకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఎస్‌డబ్ల్యూసి), వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి), ప్రైవేట్ గోదాముల యజమానులు, పౌర సరఫరాల శాఖాధికారులతో ఖరీఫ్ సీజన్ ధాన్యం నిల్వ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ధాన్యం నిల్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ ప్రాంతాల్లో సేకరించిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు తీసుకుంటున్న గోదాములు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. హమాలీలు లేని చోట్ల వెంటనే ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లయ్ వారు ఏర్పాటు చేసిన యాప్‌లో డిటిసిఎస్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి గోదాము వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని అశోక ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సమావేశం రాష్ట్ర జనరల్ సెక్రటరీ దారవత్ మోహన్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నూతన అధ్యక్షునిగా కొణిజర్ల మండలానికి చెందిన దొండ దర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ రఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా ఖమ్మం రూరల్ మండలానికి చెందిన యల్లంపల్లి యాదగిరిని, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ జానిమియా, కోశాధికారిగా గుమ్మడవెల్లి సంతోష్‌కుమార్, గౌరవ సలహాదారుగా కల్లూరు మండలానికి చెందిన రంగారావు లను ఎన్నుకున్నారు. వీరితో పాటు 34 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు అభినందించారు. రేషన్ డీలర్ల సంక్షేమానికి, సంఘం బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదులో కీలక భూమిక పోషించి అత్యధిక మంది రేషన్ డీలర్లు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకునేలా చూడాలన్నారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం పని చేస్తుందన్నారు. గౌరవ వేతనంతో పాటు కమిషన్ పెంపు కోసం సంఘం పోరాటం సాగిస్తుందన్నారు. ఈ సమావేశంలో అన్ని మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, ఖమ్మం అర్బన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, సాయికుమార్, గోళ్ల మురళీ, ఖాజామియా, జానిమియా, గాజుల భద్రయ్య, తోట వెంకన్న, లగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, సత్తార్‌మియా పాల్గొన్నారు.

# చిన్నారి వైద్య చికిత్సకు ఆర్థికసాయం






**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చిన్నారి చార్లెస్ ఫిన్నీ రక్త క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వైద్య చికిత్సకు దాతల సాయం కోరగా, స్పందించిన దాతలు మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

**పట్టణానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల రూ.7 వేల సాయం...**

చిన్నారి వైద్య చికిత్సకు 13వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు మంగళవారం రూ.7,000 ఆర్థిక సహాయం అందించారు. పువ్వాడపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కన్నెపోగు వెంకటరావు, వేముల పండు, శివ, రమేష్, శ్రీను, బాలాజీ, కృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తమ వంతు సహకారం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు.

**మిరాకిల్ మైండ్స్ విద్యార్థుల రూ.40 వేల సాయం...**

అదే విధంగా మిరాకిల్ మైండ్స్ ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు చిన్నారి వైద్య ఖర్చుల కోసం రూ.40,000 ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ మొత్తాన్ని సమకూర్చి చిన్నారి కుటుంబానికి అందజేశారు."చదువు అంటే కేవలం పుస్తకాల జ్ఞానం కాదు.. అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం కూడా నిజమైన విద్యే" అనే సందేశాన్ని విద్యార్థులు తమ సేవా కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులోనూ విద్యార్థులను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ మానవత్వం, దయ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందిస్తామని పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాకర్ మొండ్రు తెలిపారు.చిన్నారి చికిత్సకు అందుతున్న ఈ మానవతా సహకారం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు.

# గణపతి మండపాలను సందర్శించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పెనుబల్లి మండలంలో పర్యటించారు. సత్తుపల్లి నియోజకవర్గం పర్యటనలో భాగంగా మంగళవారం పెనుబల్లి మండల కేంద్రంలోని గణనాధుని మండపాలను సందర్శించారు. పెనుబల్లి బీసీ కాలనీలోని నీ కుబేర ఆంజనేయ స్వామి ప్రాంగణంలో, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాలలోని గణనాథునుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కుబేర ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మంత్రి పొంగులేటిని సాధరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి, ఆర్యవైశ్య స్మశాన వాటికకు సిసి రోడ్డు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టాలని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోగులేటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రామారావుకు మంత్రి తుమ్మల నివాళి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** డిసిసిబి మాజీ డైరెక్టర్, వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కిలారు రామారావు మృతిపట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం వి. వెంకటాయపాలెం గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్లి రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. రామారావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సర్పంచ్ కాపా ఆదినారాయణ, నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, కిలారు వెంకటరమణ, మూడ్ శంకర్, ఆవుల జానకిరాములు, అమరనేని వెంకటేశ్వర్లు, ఆదామ్, కుతుంబాక వెంకటేశ్వర్లు, మాలోత్ రమేష్, ఉయ్యాల వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటికి వినతి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మంగళవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవాలయ నిర్మాణానికి 5 కుంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించాలని, పెనుబల్లిలో గల ఆర్యవైశ్య స్మశాన వాటిక కు సీసీ రోడ్డు నిర్మాణం చేయించాలని, పెనుబల్లిలో గల ఆర్యవైశ్య స్మశాన వాటిక కు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయించాలని మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ పసుమర్తి విశ్వనాథ్, మిట్టపల్లి కిరణ్ కుమార్, ఆచంట శ్రీనివాసరావు, నాగుబండి ప్రభాకర్ రావు, చిట్లూర్ రమేష్, కోడుమూరీ శ్రీనివాసరావు, మిట్టపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి హైపవర్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. సమావేశంలో ఎస్సీ,ఎస్టీ వర్గాల సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు, హక్కుల పరిరక్షణ, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అణగారిన వర్గాలకు న్యాయం, సమాన అవకాశాలు కల్పించేలా సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంపై సమావేశంలో దృష్టి సారించారు.

# యోగాతో ఆరోగ్యం.. ఆయుర్వేదంతో శ్రేయస్సు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ యునాని, ఆయుర్వేద వైద్యశాలల సంయుక్త నిర్వహణలో యోగాతో ఆరోగ్యం.. ఆయుర్వేదంతో శ్రేయస్సు అని నినదిస్తూ మంగళవారం పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై, అంగన్‌వాడీ చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. యోగా ప్రాధాన్యతను తెలియజేస్తూ యోగ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యునాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షీలా స్రవంతి, ఫార్మసిస్టులు సంతోష్ కుమార్, కె. శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ శాంతి, ఎస్ఎన్ఓ ప్రవీణ్ కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార వైవిధ్యంపై అవగాహన



**ప్రజాపక్షం/ముదిగొండ:** ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పోషణ మాసం సందర్భంగా మండల స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార వైవిధ్యం, అధిక ప్రోటీన్ కలిగిన ఆహార పదార్థాలు, స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలతో తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కట్టకూరి ఉపేందర్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లిక, ఖమ్మం రూరల్ ప్రాజెక్టు శిశు అభివృద్ధి అధికారిణి కమల ప్రియ, ముదిగొండ వైద్యాధికారి, వల్లభి వైద్యులు నాగేంద్ర ప్రసాద్, ధర్మేంద్ర, హెచ్‌వీ తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటలో చీడపీడల యాజమాన్యంపై అవగాహన



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో వరి పంటలో వచ్చే చీడపీడలను గుర్తించడం, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఆత్మ(వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ) ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మధిర డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వాణిశ్రీ హాజరై వరి పంటను ఆశించే వివిధ రకాల చీడపీడలు, వాటి లక్షణాలు, పంటకు కలిగే నష్టం, సకాలంలో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, ఆత్మ బీటీఎం రమేశ్, ఉపేందర్, కమలాపురం సర్పంచి, ఉప సర్పంచులు పందిరి అంజయ్య, బాబూరామ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్ , అధికారులు, తదితరులు రైతులకు పలు పరిష్కార మార్గాలు, సూచనలు చేశారు.

# ఎఐటియుసిలో భారీ చేరికలు




**- కండువాలు కప్పి ఆహ్వానించిన నాయకులు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** పారిశుధ్య కార్మికులు లేకపోతే దేశంలో మానవ జీవన మనుగడకు చాలా ఇబ్బంది అని రైతుసంఘం జాతీయ నాయకులు ముత్యాల విశ్వనాథం, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్‌లు అన్నారు. మండల పరిధి 36 పంచాయితీలలో విధులు నిర్వ హిస్తున్న పారిశుధ్య కార్మికులు సిపిఐ అనుబంధ సంఘం ఏఐటియు సిలో చేరారు. వారికి నాయకులు కండువాలు కప్పి సంఘంలోకి సాద రంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ చాలీ చాలని వేతనాలతో పారిశుధ్య కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేని దీనావస్థలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయితీలలో రకరకాల పనులు చేయించుకొంటూ సమయ పాలన లేకుండా డ్యూటీలు వేస్తున్నారని, చెప్పిన పనులను పెడచెవిన పెట్ట కుండా చేస్తున్నా కానీ గ్రామంలో కొందరు వ్యక్తులు, ప్రభుత్వ అధికారుల, పంచాయితీ పాలక వర్గాల నుండి అనేక అవమానాలను ఎదు ర్కొంటున్నారని, పనిలో భద్రత లేకుండా పోయిందని వాపోయారు. బూట్లు, చేతులకు గ్లౌజులు, కొబ్బరి నూనె తదితర ఎటువంటి సౌకర్యా లను కల్పించకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. ఏఐటి యుసి నేతృత్వంలో కార్మికుల హక్కుల కోసం అవిశ్రాంతంగా ఉద్యమి స్తామని చెప్పారు. కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు 26,500 వేతనం ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, అధికారులు, పాలక వర్గాల వేధింపులను నిలిపివేయాలని, ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలని, ఆరోగ్య రీత్యా వెళ్ళిన వారికి వేతనాలతో కూడిన సెలవులు మజూరు చేయాలన్నారు. విద్యార్హతను బట్టి పనిలో వారి నైపుణ్యతను బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క పని కేటాయించాలని, అన్ని పనులను ఒక్కరికే కేటాయించటం, పని ఒత్తిడి పెంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుండి ఆ పద్ధతిని మార్చాలని లేని యెడల ఏఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్య క్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఏఐటియుసి పాల్వంచ పట్టణ, మండల కార్యదర్శి ఇట్టి వెంకటరావు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్య దర్శి నిమ్మల రాంబాబు, పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు చంచలపురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రుల జలదోపిడిని అరికట్టాలి

**ఇల్లందు మాజీ శాసనసభ్యుల గుమ్మడి నరసయ్య**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మంత్రుల జలదోపిడీని అరికట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ నీళ్లను కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు అందజేయా లని ఇల్లందు మాజీ శాసనసభ్యులు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి లు డిమాండ్ చేశారు. మంగ ళవారం జూలూరుపాడు మండల పరిధిలోని వినోబా నగర్ ప్రాంతం లోని సీతారామ ప్రాజెక్టును మాస్ లైన్ పార్టీ ప్రతినిధి బృందం పరిశీలిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో వేల ఎకరాలు భూములు కోల్పోయి ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఈ జిల్లాలోని రైతాం గానికి నీరు అందించకుండా ఇతర ప్రాంతాలకు జలాలను తరలిస్తూ ఉమ్మడి జిల్లాలోని మంత్రులు జలదోపిడి చేస్తున్నారని దుయ్యబట్టారు. జిల్లా చివరి ప్రాంతమైన జూలూరుపాడు నుంచి ఖమ్మం జిల్లాకు నీరు తరలిస్తున్నారని, అదే సమయంలో ఇక్కడ రైతాంగానికి కూడా నీరు అందించేందుకు చర్యలు చేపట్టకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో డిజైన్ చేసిన విధంగా రోళ్లపాడు చెరువు నింపడం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తానికి పక్కనున్న మహబూబాబాద్ జిల్లాకు కూడా తక్కువ ఖర్చుతో నీరందించే అవకాశం ఉన్నప్పటికీ గతంలో అధికారంలో ఉన్నబిఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ చేసి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి చుక్క నీరును ఈ జిల్లా రైతాంగానికి అందించ లేదని విమర్శించారు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట నష్టపోతున్న ప్రాంతానికి నీరు అందించకుండా మంత్రులు



అధికార బలంతో ఇతర ప్రాంతాలకు నీరు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి కాలువలు నిర్మించారని, పంటలు పండే వారికే మరో పంట పండేందుకు నీరు అందించి మంత్రులు తమ కుటిల బుద్ధిని చాటుకున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు జిల్లాలో నష్టపోయిన రైతాంగం కోసం, జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయించేందుకు కృషి చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్ట్ కాల్వను పరిశీలించిన వారిలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, అమర్లపూడి రాము, జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు,భానోత్ ధర్మ, ఎస్ కే యాకుషావలి, కల్లూరి కిషోర్, బుర్ర వెంకన్న, మండల నాయకులు లింగాల, వీరభద్రం, తోట కూరి నరేష్, బైరు వెంకన్న, రాయల సిద్ధ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

**-తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి**
**-జెడ్‌పీ సీఈవో నాగలక్ష్మి**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జెడ్‌పీ సీఈవో నాగలక్ష్మి సూచించారు. సోమవారం మోరంపల్లి బంజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని మండల ప్రాథ మిక పాఠశాలలో నిర్వహిం చిన స్వచ్ఛతా హీ సేవా 2026 కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయ కుండా చెత్తబుట్టలను వినియోగించాలని సూచించారు. వైద్య, పారి శుద్ధ్య వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపరాదన్నారు. విద్యార్థులు చిన్న నాటి నుంచే పరిశుభ్ర తపై అవగాహన పెంచు కుని ఇళ్లు, పాఠశాలల్లో స్వచ్ఛత పాటించాలని కోరారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యా యులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. నాటిన మొక్క లను సంరక్షించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జమ లారెడ్డి, ఎంపీఓ రామకృష్ణ, సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉప సర్పంచ్ పొక్కుల రవి, పంచాయితీ కార్యదర్శి భవాని, ఏపీవో విజయలక్ష్మి , డీఆ ర్‌డీఏ ఎస్‌బీఎం కన్సల్టెంట్ రేవతి, ఈసీ వెంకట్, టీఏ స్వాతి, వార్డు సభ్యుడు పుల్లారెడ్డి, హెచ్‌ఎం శిరోమణి, ఉపాధ్యాయులు రామారావు, గ్రామ పెద్ద గాదె నర్సిరెడ్డి , విద్యార్థులు పాల్గొన్నారు.

# సూర్యతండ గణపతి మండపం వద్ద అన్నదానం

**ప్రజాపక్షం/కారేపల్లి:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సింగరేణి మండలం సూర్యతండ గణపతి మండపం వద్ద మంగళవారం భక్తులకు ఘనంగా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దాత ఒకే సాయి, స్థానిక సర్పంచ్ బానోత్ రాందాస్ నాయక్ భక్తులకు స్వయంగా భోజనం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి, గణనాథుడిని దర్శించు కుని అన్నప్రసాదం స్వీకరించారు. నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో మండపం వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది.



## మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవానికి తరలిరావాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అశ్వాపురం మండలం మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బూర్గంపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి కోరారు. ఈనెల 23న బుధవారం ఉదయం 9:30గంటలకు జరిగే కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు. జిల్లా పార్టీ ప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఐఎన్‌టీయూసీ, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, మహిళా, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాల నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గణపతి నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయితీ పరి ధిలోని మహాలక్ష్మమ్మ కాలనీలో టీమ్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన కళ్యాణ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసా దాలు అందజేశారు. శివ పార్వతుల అనుగ్రహంతో గ్రామ ప్రజలకు సుఖశాంతులు, ఆయురా రోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆర్లగూడెం ఉప కేంద్రం పరిధి ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 16 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. జ్వరంతో బాధపడుతున్న ఐదుగురికి మలేరియా పరీక్షలు చేయగా, ముగ్గురికి సాధారణ జ్వరంగా నిర్ధారించి మందులు ఇచ్చారు. విద్యార్థినులకు వ్యక్తిగత, ఆహార, పరిసరాల పరిశుభ్రతతో పాటు సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, ఏఎన్ఎం హైమావతి, గంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆశా కార్యకర్తలు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దనల్లబెల్లిలో అన్నదానం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** గణేష్ నవరాత్రుల సంద ర్భంగా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబెల్లి గ్రామం లోని వినాయక మండపం వద్ద రెండెద్దుల ప్రభాకర్‌రెడ్డి, చిన్ని దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం మంగళ వారం నిర్వహించారు. వినాయకుడి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించారు. గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని దంపతులు ఆకాం క్షించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య పనులు



**ప్రజాపక్షం/గుండాల:** ముత్తాపురం ఏకలవ్య పాఠశాలలో నూతనంగా ఏర్పాటైన పేరెంట్, టీచర్ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పాఠశాల పరిసరాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు, దోమల బెడద ఏర్పడుతోందని గుర్తించి ఆవరణం, సిబ్బంది క్వార్టర్స్, డైనింగ్ ప్రాంతాల్లో గడ్డి మందు పిచికారీ చేయించారు. అనంతరం చెత్తాచెదారాన్ని తొలగిస్తూ కమిటీ సభ్యులు శ్రమదానం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యతో పాటు మంచి ప్రవర్తన పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను కోరారు. ఈకార్యక్రమంలో సీహెచ్ రాజబాబు, ఎస్ ప్రవీణ్, జి సుధాకర్, ఎం అశోక్, ఎండీ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి చేసిన దుండగులు అరెస్ట్



**ప్రజాపక్షం/కరకగూడెం:** అశ్వాపురంపాడు గ్రామ శివారులో ఉన్న ఫారెస్ట్ ప్లాంటేషన్ వద్ద అశ్వాపురం పాడు గ్రామానికి చెందిన వజ్జా భీమరాజు అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేసి మెడ పైన తల పైన విచక్షణారహితంగా గాయపరిచిన వ్యక్తులని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఏడుళ్ళ బయ్యారం సీఐ వి వెంకటేశ్వరరావు వెల్లడిం చారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోవాసి బాలకృష్ణ, పోడియం విజయ్, కోవాసి సంతోష్, పోడియం మంగయ్య అను నలుగురు వ్యక్తులు గతంలో వాళ్ల ఊరు పెద్దమనిషి అయిన వెంకటేశ్వర్లు మొదటి ముద్దాయి వాళ్ల నాన్న చంపబడినందుకు అతను చంపిన వ్యక్తి భీమరాజు అని జైలు నుంచి విడు దల కాగానే ఈ నలుగురు మాట్లాడుకుని అతనిని ఫారెస్ట్‌కు పశువుల మేపటానికి వెళ్లగా అతని వెంబడించి కత్తులతో నరికి అక్కడ నుంచి వెళ్ళిపోయారని తెలిపారు. ఈ రోజున నలుగురు నేర స్తుల్ని కరకగూడెం పోలీసు వారు పట్టుకొని వారిని రిమాండ్ కి పంపినట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో కరకగూడెం ఎస్సై పివిఎన్ రావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



## -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్ష

ప్రజాపక్షం/కూసుమంచి: విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు.

**ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి...**

గణపతి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లే నిమజ్జనాన్ని కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మంత్రి సూచించారు. భక్తులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం, గురవాయిగూడెం, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, ఏదులాపురం పరిధి మారుతినగర్, ఖమ్మం నగరంలోని బేడ జంగాల కాలనీ, శ్రీనగర్ కాలనీల్లోని మండపాలని మంత్రి సందర్శించారు. ఈకార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోక బత్తిని అనిత, వైస్‌ఛైర్మన్ తమ్మినేని నవీన్, కూసుమంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిషోర్, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

ప్రజాపక్షం/మణుగూరు: మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పినపాక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) పాయం వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఇరిగేషన్ మరియు వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సభాస్థలి, డెలివరీ పాయింట్, హెలిప్యాడ్ ప్రాంతాలను తనిఖీ చేశారు. గొందిగూడెంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని పరిశీలించి, హాజరయ్యే ప్రజలు, నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు పకడ్బందీగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్ వద్ద జరుగుతున్న పనుల పురోగతిని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకుని, ప్రారంభోత్సవానికి పనులను వేగవంతం చేయాలని సూచించారు. మంత్రుల రాక కోసం మారెళ్లపాడులో సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించి, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రుల పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించి, మార్గమధ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు



తలెత్తకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు మరియు అధికారులను కోరారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్‌ఎలు పోలింగ్ బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి



## మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు

ప్రజాపక్షం/కరకగూడెం: బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రతి బిఎల్‌ఏ తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు కోరారు. మంగళవారం మణుగూరు తెలంగాణ భవన్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్, ఓటర్ల వివరాల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో మన బూత్ పరిధిలోని ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత ఉన్న ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు, తప్పులు లేదా అర్హత ఉన్న ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడం గమనించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ ప్రక్రియను పూర్తి చేయించాలి అన్నారు. ప్రత్యేకంగా నోటీసులు అందిన ఓటర్లకు సంబంధించిన వివరాలను పరిశీలించి, వారికి అవసరమైన సహకారం అందించాలి అన్నారు. ప్రతి బిఎల్‌ఏ తమ బూత్‌లో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అప్రమత్తంగా పనిచేయాలి అన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు బూత్ స్థాయిలో నిరంతరం మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, టిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానిక బిఎల్‌ఏ లను సమన్వయం చేస్తూ, వారిని పర్యవేక్షిస్తూ, ప్రతి అర్హత కలిగిన ఓటు రక్షించే బాధ్యతగా వ్యవహరించాలని కోరుతున్నానని రేగా తెలిపారు.

# శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నదానం



ప్రజాపక్షం/మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని వర్తక సంఘంలో ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం నందు అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నదాన ధాతలు ఈడ శేషగిరిరావు ధర్మపత్ని తిరుమలాదేవి, చలువాది ఆశిత పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు గోపికాంత్, కళ్యాణి ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సింగరేణిలో కొత్త మిషనరీ ఏర్పాటు చేయాలి

## గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిమాండ్



ప్రజాపక్షం/మణుగూరు: పీకే ఓ సి 2, కేసిహెచ్పి లో ఉన్నతాధికారులకు మెమో రాండం అందజేత పీకే ఓ సీ 2, కెసిహెచ్పిలలో నూతన వాహనాలు, యంత్రాల విడిభాగాలు, సేఫ్టీ పరికరాలు, సరైన మ్యాన్ పవర్ లేకపోవడం వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. డంపర్, దోజరు, షావల్ లు, వాటి విడిభాగాలు,సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. కెసిహెచ్ పి కి సంబంధించి రోలర్లు, బెల్టులు, హైడ్రల్లు, కమ్యూనికేషన్ సిస్టం, టెక్నీషియన్స్ కి పని ముట్లు, కార్మికులకు లెదర్ షూ, ఆఫీస్ చైర్స్ అండ్ కార్మికులకు లాకర్లు, బేరింగులు, స్పేర్ పార్ట్స్ పీపీఈ కిట్స్, డస్ట్ సస్పెన్షన్ సిస్టం స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. నూతన యంత్రాలు, యంత్రాల విడిభాగాలు, రక్షణ పరికరాలు లేకపోవడం వలన ఉత్పత్తి ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం ఏర్పడుతుందని, రక్షణతో పని చేయడం కూడా కష్టమవుతుందన్నారు. కావున మేనేజ్మెంట్ వెంటనే సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామ నరసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, జీఎం కమిటీ మెంబర్ ఆవుల నాగరాజు, ఫిట్ సెక్రటరీలు ఎస్ కుమారస్వామి, జి శ్రీనివాసరావు, ఉడుత శివ, బైరి వెంకటేశ్వర్లు, బివి సత్యనారాయణ, హుస్సేన్, నాగుల సతీష్, కోడి రెక్కలు శ్రీనివాస్, వేణు, శ్రీనివాస్, కళ్యాణం రవి, వినయ భాస్కర్ పాల్గొన్నారు.

# మణుగూరు కరాటే మాస్టర్స్‌కు గ్లోబల్ అవార్డులు



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరుకు చెందిన కరాటే మాస్టర్ కాసిమల్ల పద్మ, గుగులోత్ రిషిక గ్లోబల్ స్థాయిలో అవార్డులు అందుకోవడం పట్ల పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. మణుగూరుకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్ కాసిమల్ల పద్మ బ్లాక్ బెల్ట్ 4వ డాన్ విభాగంలో గ్లోబల్ మాస్టర్ అవార్డు అందుకోగా, గుగులోత్ రిషిక బ్లాక్ బెల్ట్ 1వ డాన్ విభాగంలో గ్లోబల్ స్టార్ కిడ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కాసిమల్ల పద్మ, గుగులోత్ రిషిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శాలువాలతో సత్కరించి అభినందించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన వారు గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ రంగాల్లో యువత మరింతగా రాణిస్తూ ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మణుగూరు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.

# అంబేద్కర్ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డీవైఎఫ్ఐ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదెర్ల వినయ్‌కుమార్ మాట్లాడుతూ స్వల్ప వర్షానికే మురుగునీరు, వర్షపు నీరు కలిసి రోడ్లపై నిలిచి బురదమయంగా మారుతున్నాయని తెలిపారు. నిల్వ నీటితో దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించాలని, లేకుంటే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆదెర్ల నాగరాజు, సాయి, పిట్టల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆయుర్వేద దినోత్సవ వేడుకలు




ప్రజాపక్షం/కూసుమంచి:ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21నుంచి 23వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు వయోవృద్ధులకు ఆరోగ్యకర ఆహారంపై, అంగన్వాడీ చిన్నారులకు పోషణపై అవగాహన కల్పించారు. మంగళవారం పిహెచ్‌సి నుంచి యోగా నడక నిర్వహించి, అనంతరం చిన్నారులతో యోగా, ధ్యానం చేయించారు. 23న ఆయుర్వేద సృష్టికర్త ధన్వంతరి చిత్రపటానికి పూజలు నిర్వహించి, ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించనున్నట్లు ప్రభుత్వ హోమియో వైద్యురాలు డాక్టర్ పోరిక జ్యోతి, పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ సాయికుమార్ తెలిపారు. ఆయుష్‌లో ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమియో విభాగాలు ఉన్నాయని, సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుర్వేదం, యోగా దోహదపడతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో యోగా శిక్షకురాలు మాధవి, సిహెచ్‌ఓ వలి, స్టాఫ్ నర్సులు షాజిద, మహేశ్వరి, కిరణ్ కుమార్, అయితరాజు రామకృష్ణ, వాస రాధాకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/గుండాల : రైతాంగ సమస్యలపై ఈ నెల 28,29,30 తేదీలలో ఖమ్మం లో జరిగే ఏఐకెఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని ముత్తాపురం గ్రామంలో బైక్‌ర్యాలి నిర్వహించారు. ఆ సంఘ మండల నాయకులు గడ్డం లాలయ్య కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న రైతాంగ వ్యతిరేక విదానాలపై రైతులు,కూలీలు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు రైతులకు పన్నెండు వేలు ఇస్తామని , వ్యవసాయ రంగాన్ని రక్షిస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వాలు కార్పోరేటు శక్తులకు వ్యవసాయ రంగాన్ని దారా దత్తం చేస్తూ నూతన వ్యవసాయ రంగ చట్టాలతో పల్లెల్లో నివసించే రైతులను దివాలా తీపిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పూనెం నర్సయ్య, తాటి రమేష్, సూర్యనారాయణ, రమణయ్య, వెంకన్న, నరసింహారావు, జనగం లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో ఏక్ ఫెడ్ మాకే నామ్



ప్రజాపక్షం/మధిర: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏక్ ఫెడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ జి.శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో మిరియాల రమణగుప్తా పాల్గొని కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పివో బి.తౌరియా, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

# వైరా మున్సిపాలిటీకి అసమ్మతి సెగ



**-ఐదుగురే హాజరు**
**-ఒక్కరే కౌన్సిలర్.. మిగిలిన వారు భర్తలే**
**-ఎమ్మెల్యే చొరవ చూపాలి : స్థానికులు**




ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపల్ కౌన్సిల్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ల మధ్య నెలకొన్న విభేదాలు మంగళవారం మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఈ నెల19న జరగాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడిన నేపథ్యంలో, మంగళవారం కాంగ్రెస్ కౌన్సిలర్ల సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. అయితే అధికార పార్టీకి చెందిన 13 మంది కౌన్సిలర్లలో ఐదుగురు మాత్రమే సమావేశానికి హాజరు కావడం పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చకు దారితీసింది. మంగళవారం మున్సిపాలిటీలో జరిగిన సమావేశానికి 8వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు హాజరు కాగా, చైర్‌పర్సన్ భర్త డాక్టర్ కాపా మురళీకృష్ణ, 4వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి భర్త వేముల రత్నాకర్, 17వ వార్డు కౌన్సిలర్ భర్త ఏడుకొండలు, 20వ వార్డు కౌన్సిలర్ పుంద్రు వరలక్ష్మి భర్త పుంద్రు శ్యామ్‌బాబు పాల్గొన్నారు. మిగిలిన కౌన్సిలర్లు గైర్హాజరు కావడం చర్చకు కారణమైంది. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సమక్షంలో కాంగ్రెస్ కౌన్సిలర్లందరరూ సమావేశమై తమ అభిప్రాయాలను చర్చించుకోవాలనే వాదన కౌన్సిలర్ల నోటి మాట వినిపిస్తుంది. ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ పెద్దల సమక్షంలో సమస్యలను చర్చించి, స్పష్టత వచ్చిన తర్వాతే కౌన్సిల్ సమావేశం జరిగే సూచనలు ఉన్నాయి. తమ అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని కొందరు కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని కౌన్సిల్ ఎజెండాలో చేర్చడం, కౌన్సిలర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం, నిర్ణయాల విషయంలో అందరినీ కలుపుకొని వెళ్లడం లేదు అనే వంటి అంశాలు ప్రస్తుతం చర్చకు వస్తున్నాయి.

**కౌన్సిల్ సమావేశానికి అసలు అడ్డంకి ఏమిటి?**

ప్రజా సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన వేదిక మున్సిపల్ కౌన్సిల్ అలాంటి సమావేశాలు సజావుగా జరగాలంటే పాలకవర్గం లోని సభ్యుల మధ్య సమన్వయం కీలకం. సమావేశాలు వాయిదా పడటానికి అసలు కారణాలు ఏమిటి? కౌన్సిలర్ల మధ్య అభిప్రాయ బేధాలా? ఎజెండా రూపకల్పనలో సమన్వయ లోపమా? లేక పార్టీ అంతర్గత వ్యవహారాలే కారణమా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే కౌన్సిల్ సమావేశాల నిర్వహణపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ కౌన్సిలర్ల సమావేశానికి కూడా ఎక్కువ మంది హాజరు కాకపోవడం పరిస్థితి తీవ్రతపై మరింత ఆసక్తిని పెంచింది. రూ.80లక్షలను వార్డుల వారీగా విభజిస్తే వార్డుల్లో డ్రైనేజీ రోడ్ల పూర్తి చేసుకోవచ్చు అని ఎక్కువ మంది కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ కౌన్సిలర్లలో నెలకొన్న ఈ అసంతృప్తి ఎటువైపు దారితీస్తుంది? పార్టీ పెద్దలో జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరిస్తారా? తదుపరి కౌన్సిల్ సమావేశం సజావుగా జరుగుతుందా? అనేది ఇప్పుడు వైరా మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది.

# విద్యార్థి విప్లవ పతాక ఏఐఎస్ఎఫ్

**-ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల గోడపత్రులు ఆవిష్కరణ**




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాగ్నిని రగిలించిన నిప్పుకణం, విద్యార్థి విప్లవ పతాక ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి లక్ష్మణ్, బీరా మనోజ్ తెలిపారు. మంగళవారం గిరిప్రసాద్ భవన్‌లో ఈనెల 28 నుంచి 30 వరకు హన్మకొండలో జరిగే ఏఐఎస్ఎఫ్ 90 వార్షికోత్సవాల ముగింపు గోడప్రతులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి మలి దశ ఉద్యమంలో వీరోచిత పోరాటం చేసిన సంఘం, దేశ చరిత్రలో ఎందరో త్యాగధనులను అందించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు. అలుపెరుగని సమరశీల ఉద్యమాల వేదిక ఏఐఎస్ఎఫ్ అన్నారు. స్వాతంత్ర్య పోరాట స్పూర్తితో తెలంగాణ ఉద్యమ వారసత్వంతో నిత్యం విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. మోకాలే విద్యా విధానం మాకొద్దు అంటూ విద్యారంగంలో సంస్కరణల కోసం పోరాడి, కోఠారి కమిషన్ సిఫారసులను అమలుచేయాలని పోరాటం చేసిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌దే అన్నారు. చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అన్న నినాదంతో విద్యా రంగ పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ బహుముఖ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. స్కాలర్‌షిప్‌ల పెంపు కోసం యూనివర్సిటీలలో మతోన్మాదులకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ పోరాడుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్నదన్నారు. 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ నాగులమీరా, జిల్లా ఉపాధ్యక్షులు శివానాయక్, మనోహర్, గోపి, శివ, పవన్, నరేందర్ పాల్గొన్నారు.

# గణనాథుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలి



**-రాష్ట్ర మంత్రి పొంగులేటి**
**-సత్తుపల్లి నియోజకవర్గంలో ఘనంగా గణేష్ నవరాత్రి పూజలు**

ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలు గణేష్ మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ లు మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్ కృష్ణవే గుడి వద్ద, జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్డులో, శ్రీ కోదండరామాలయం వద్ద, జేవీఆర్ పార్క్ వద్ద శ్రీ ప్రసన్న గణపతి ఉత్సవాల్లో, జేవీఆర్ పార్క్ ఎదురుగా ఉన్న శ్రీ గణేష్ గుడి వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో వారు భక్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహ్మద్ రిహాన కమల్ పాషా, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు దేవీ స్వీట్స్ శ్రీను, మట్టా ప్రసాద్, వీరివాడ అపర్ణ, తోట సుజలరాణి గణేష్, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, బేతుపల్లి సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మందపాటి ముత్తారెడ్డి, దొడ్డా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : కస్తూర్బా గాంధీ బాలిక ల విద్యాలయం (కెజీబివి)లో ఖాళీగా ఉన్న రెండు అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి బి. రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత పనిలో అనుభవం కలిగిన మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, దరఖాస్తు ఫారం, ఏడవ తరగతి మార్కుల మెమో, ఇతర సంబంధిత ధృవపత్రాల జిరాక్స్ కాపీలతో కెజిబివి పాఠశాలలో అందించాలన్నారు. దరఖాస్తులు ఈనెల 25న సాయంత్రం ఐదు గంటల వరకు అందించవచ్చునని ఎంఈవో తెలిపారు. అర్హత కలిగిన మహిళలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రేపు జాబ్‌మేళా

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అపోలో ఫార్మసీ, ఖమ్మంలోని వరుణ్ మోటార్స్, భారత్ హ్యూందాయ్ లలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 24న గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టిటిడిసి నందు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ అపోలో ఫార్మసీలో పనిచేసే విధంగా ఫార్మసిస్టు, ట్రైనీ ఫార్మసిస్టు, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వయిజర్, రిటైల్ ట్రైనీ అసోసియేట్‌గా పనిచేయుటకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వారు బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ అర్హత గల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 12,500 నుంచి రూ. 25వేల వరకు ఉంటుందన్నారు. ఖమ్మంలో వరుణ్ మోటార్స్ లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్, సెక్యూరిటీ, అడ్వయిజర్ ఉద్యోగాలకు 22 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 15వేల నుంచి రూ.30వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఖమ్మం భారత్ హ్యూండాయ్‌లో ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్స్, టెక్నీషియన్, టెలికాలర్ ఉద్యోగాలకు 23 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 18వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. మొత్తం 127 ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు హెచ్ఆర్ నెంబర్ 92841107531, 7036902902, 7207917714 ను సంప్రదించాలన్నారు.

## సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన



ప్రజాపక్షం/మధిర: మధిర మండలం మల్లవరం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు సహజ వ్యవసాయ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్ మాట్లాడుతూ సహజ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకునే అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మల్లవరం వ్యవసాయ విస్తరణ అధికారి గోపి రైతులకు పంటల వారీగా సహజ వ్యవసాయ పద్ధతులపై వివరించారు. ఎన్ఎంఎన్ఎఫ్ వాలంటీర్ జస్వంత్ సహజ వ్యవసాయం లో జీవ ఆధారిత ఇన్‌పుట్ల వినియోగం, రైతులకు అందుబాటులో ఉన్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మల్లవరం క్లస్టర్‌కి చెందిన రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయం



ప్రజాపక్షం/వైరా: చెరుకూరి శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి దంపతులు తనయుడు సుమంత్ రిషిత్ పుట్టినరోజు సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫణితి సైదులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను విద్యార్థులతో కలిసి జరుపుకోవాలనే ఆలోచనతో భోజన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు, పుంద్రు శ్యామ్‌బాబు, వేముల రత్నాకర్, ఎస్ఎంసి చైర్మన్ ఆది రజిని, సరిపూడి కోటేశ్వరరావు, ఫణితి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పెసర పంటను వెంటనే కొనుగోలు చేయాలి



ప్రజాపక్షం/వైరా: రైతులు సాగు చేసిన పెసర పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున పెసర పంటను సాగు చేసి దిగుబడులు సాధించారని, అయితే ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముందస్తు వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సకాలంలో పెసర కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు పంటను విక్రయించాల్సిన పరిస్థితి ఉండేది కాదన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రభుత్వం రైతుల పట్ల కపట ప్రేమ చూపకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కట్టా కృష్ణార్జునరావు కోరారు. పెసర కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# మారెళ్లపాడు నిర్మాణంలో మాయాజాలం







**-అంతుచిక్కని లెక్కలు..**
**-అన్నీ తప్పుడు లెక్కలు.. అక్రమ తరలింపులు**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** సీతారామ ఎత్తిపోతల పథకంలోని మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పరిధిలో చేపట్టిన సుమారు మూడు కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు ఇప్పుడు అధికారుల పర్యవేక్షణకు పరీక్షగా మారాయి. పనులు పూర్తయినట్లు కనిపిస్తున్నా...వాటి వెనుక ఉన్న కొలతలు, తవ్వకాల లెక్కలు, పైపుల వివరాలు, మట్టి తరలింపు, బ్లాస్టింగ్ అనుమతులు, బిల్లులు, భద్రతా చర్యలు మాత్రం అనేక ప్రశ్నలను మిగులుస్తున్నాయి.

### మూడు కిలోమీటర్లు..కానీ లెక్క ఎంత.?

పైప్‌లైన్ వాస్తవంగా ఎన్ని మీటర్లు వేశారు? ఎన్ని పైపులు అమర్చారు? ఒక్కో పైపు పొడవు, వ్యాసం, మందం ఎంత? నిర్ణీత లోతులోనే అమర్చారా? ఈ ప్రశ్నలకు ఎంబీ రికార్డులు సమాధానం చెబుతున్నాయా? గుత్తేదారు నమోదు చేసిన కొలతలను సాంకేతిక అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో కొలిచి ధృవీకరించారా? లేక పనులు పూర్తయ్యాక రికార్డుల ఆధారంగానే బిల్లులు ముందుకు వెళ్లాయా? ఎంబీలో ఉన్న కొలత, నేలపై ఉన్న కొలత ఒక్కటేనా? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

### తవ్విన మట్టి..లెక్కలో ఉందా...?

పైపులైన్ కోసం ఎంత లోతు, ఎంత వెడల్పుతో తవ్వారు మొత్తం ఎంత మట్టి బయటకు వచ్చింది ఎంత రాతి పొర తొలగించారు? బయటకు వచ్చిన మట్టి ఎక్కడికి వెళ్లింది? ఎవరు తరలించారు? ఎంత ఖర్చయింది? దానికి రికార్డు ఉందా? తవ్వకాల పరిమాణం అంచాన నివేదికలతో సరిపోతుందా యంత్రాలతో చేసిన తవ్వకాలకు సంబంధించిన వివరాలు బిల్లుల్లో ప్రతిబింబిస్తున్నాయా? మట్టి తరలింపునకు సంబంధించిన లెక్కలను అధికారులు ఎప్పుడైనా తనిఖీ చేశారా?

### బ్లాస్టింగ్ జరిగిందా? జరిగితే ఎవరి అనుమతితో...?

రాతి పొరల తొలగింపులో కొన్ని ప్రాంతాల్లో బ్లాస్టింగ్ జరిగినట్లు సమాచారం వినిపిస్తోంది. అదే నిజమైతే అసలు ప్రశ్నలు అక్కడి నుంచి మొదలు, అనుమతి ఎవరిచ్చారు? భద్రతా ప్రణాళిక ఏమిటి? బ్లాస్టింగ్‌కు ముందు పరిశీలన ఎవరు చేశారు? తర్వాత తనిఖీ ఎవరు చేశారు? రికార్డుల్లో నమోదు చేశారా? అనుమతులు ఉంటే వాటి వివరాలు బయటపెట్టాలి. అనుమతులు లేకుంటే బ్లాస్టింగ్ ఎలా జరిగింది? దాన్ని ఎవరు అడ్డుకున్నారు? అన్నదానికి అధికారులు సమాధానం చెప్పాలి.

### రైల్వే ట్రాక్ పక్కనే పనులు..ప్రమాదం వస్తే బాధ్యులెవరు...?

ఇక్కడే వ్యవహారం మరింత సీరియస్‌గా మారుతోంది. పైప్‌లైన్ పనులు రైల్వే ట్రాక్‌కు అత్యంత సమీపంలో జరిగి ఉంటే రైల్వే అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చారా? అవసరమైన అనుమతులు తీసుకున్నారా? బ్లాస్టింగ్ జరిగి ఉంటే ట్రాక్‌పై వైబ్రేషన్ ప్రభావాన్ని అంచనా వేశారా? భూమి కదలికలు, మట్టి కుంగిపోవడం, పైప్‌లైన్ లీకేజీ, భవిష్యత్తు మరమ్మతుల సమయంలో ట్రాక్‌కు ముప్పు రాకుండా సాంకేతిక భద్రతా పరిశీలన జరిగిందా? రోజూ ఆ మార్గంలో ప్రయాణించే రైళ్ల భద్రతకు ఎలాంటి ముప్పు లేదని సంబంధిత శాఖలు లిఖితపూర్వకంగా ధృవీకరింగలవా?

### పర్యవేక్షణ..ఫైళ్లలోనా? ఫీల్డ్‌లోనా...?

పనులు జరుగుతున్న సమయంలో అధికారులు ఎన్ని సార్లు క్షేత్రస్థాయికి వెళ్లారు? తనిఖీలు లేదీలు ఏమిటి ఏ లోపాలు గుర్తించారు కాంట్రాక్టర్‌కు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారు?. బిల్లులపై సంతకం చేయడం పర్యవేక్షణ కాదు. పనుల నాణ్యత, పరిమాణం, భద్రతను క్షేత్రస్థాయిలో నిర్ధారించడమే అసలు పర్యవేక్షణ. ఈ ప్రమాణంలో మారెళ్లపాడు పనులను అధికారులు ధైర్యంగా నిలబెట్టి చూపించగలరా...?

### రికార్డులు తెరిస్తే..నిజాలు బయటపడతాయా?

ఈ వ్యవహారంపై అనుమానాలు తొలగాలంటే సంబంధిత అధికారులు కేవలం ప్రకటనలతో సరి పెట్టకుండా రికార్డులను పరిశీలించాలి. అంచానాలు..సాంకేతిక అనుమతులు..ఎంబీలు..పైపులు సరఫరా వివరాలు..క్షేత్రస్థాయి కొలతలు..తవ్వకాల పరిమాణం..మట్టి తరలింపు.. బ్లాస్టింగ్ అనుమతులు..రైల్వే అనుమతులు..తనిఖీ నివేదికలు..బిల్లులు అన్నింటినీ ఒకే సారి తనిఖీ చేస్తే విషయాలు బయటపడతాయని పలువురు కోరుతున్నారు.

### ప్రజాధానం...రైతుల భవిష్యత్తు..రైల్వే భద్రత

ఇది సాధారణ పైప్‌లైన్ పని కాదు. ప్రభుత్వ నిధులతో, రైతుల ప్రయోజనం కోసం చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకంలో కీలకమైన నిర్మాణం. అందువల్ల పని పూర్తయిందా లేదా అన్నదే కాదు..ఎలా పూర్తయింది? ఏ నాణ్యతతో పూర్తయింది? ఎంత ప్రజాధనం ఖర్చయింది? భవిష్యత్తులో ప్రమాదాలకు తావులేకుండా నిర్మించారా? అన్నదే అసలు విషయం.

### సాంకేతిక విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తుందా...?

మారెళ్లపాడు పైప్‌లైన్‌పై ఉన్నత స్థాయి సాంకేతిక విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తే అసలు విషయాలన్నీ వెలుగులోకి వచ్చే అవకావం ఉంది. ఎంబీ రికార్డులను ప్రజలు ముందు ఉంచిందే, రైల్వే భద్రతపై సాంకేతిక నివేదిక విడుదల చేస్తే, బ్లాసింగ్ జరిగితే దాని అనుమతులను వెల్లడిస్తే ఇలా అన్ని విషయాలపై పూర్తి స్థాయి నివేదికలను ప్రజలు ముందు ఉంచితే ప్రజలల్లో ఉన్న అనుమానాలు బయటపడతాయని పలువురు కోరుతున్నారు. సమాధానం చెప్పాల్సింది అధికారులే..అనుమానాలకు ముగింపే పలకాల్సింది రికార్డులే..ఈ విషయంపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వెచ్చి చూడాలి.

# భూ రీ సర్వే పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్



**ప్రజాపక్షం/కరకగూడెం:** పినపాక నియోజకవర్గం లోని బూర్గంపాడు, పినపాక, పట్టి నగర్, అశ్వాపురం, కొమ్ముగూడెం గ్రామం, పినపాక మండలం సున్నం వారి గూడెం, కరకగూడెం మండలం బట్టుపల్లి గ్రామం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ట మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పినపాక పట్టి నగర్, కొమ్ముగూడెం, సున్నం వారి గూడెం, బట్టుపల్లి గ్రామాలలో జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి, సర్వే పురోగతి, భూ హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు ఇస్తూ రెవెన్యూ అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసి ఉన్నందున ఆయా భూముల హద్దులను రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ భూముల హద్దులు ఇప్పటికే నిర్ధారితంగా ఉన్న ప్రాంతాల్లో అనవసర జాప్యం లేకుండా మిగిలిన రీసర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా చేపట్టి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశా రు. అనంతరం గ్రామస్తులు, రైతులతో మా ట్లాడి రీ సర్వే పనులకు సంబంధించి ఏమైనా సమస్యలను ఎదుర్కొన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఈ సర్వే పనులు నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని అన్నారు. వర్షాకాలం నడుస్తున్నందున కార్యాలయం ప్రాంగణంలో చెత్తాచెదారం పిచ్చి మొక్కలు పేరుకుపోకుండా శుభ్రంగా ఉంచాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సిబ్బంది సక్రమంగా తమ విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహాశీల్దారు లు, లైసెన్సుడ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన నియోజకవర్గాలకు అధికంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని ఇల్లం దు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య సహచర గిరిజన ఎంఎల్‌ఏలతో కలిసి హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రిని శ్రీహరి శాలువాతో సత్కరించి మహాప్రసాదం అందజేశారు. అనంతరం గిరిజన శాసన సభ నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇళ్లను అధికంగా మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎంఎల్‌లు కోరారు. గిరిజన ప్రాంతాల్లో అర్హులైన పేదలకు ఇళ్ల కల సాకారం చేయాలన్న అంశంపై ఈ విజ్ఞప్తి చేసినట్లు ఎంఎల్‌ఏ కోరం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నేలకొండపల్లి తహాశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిమజ్జనం పై సమీక్ష సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిమజ్జనం లో ఎలాంటి ఆటంకాలు లేకుండా సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. మండల పరిసర ప్రాంతాల విగ్రహాలను ముజ్జుగూడెం చెరువులో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. డిజెలతో ప్రదర్శనలు నిషేధం అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కమిటి నిర్వహాకులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు, ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి. "సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కోరట్లగూడెంలో అన్నదానం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నేలకొండపల్లి యస్.ఐ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. మొదట వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, కోత్తపల్లి వెంకటేశ్వరరావు, రాయిగూడెం సర్పంచ్ బోయిన వేణు, నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు, కణతాల గోవిందరావు, దండా రామకృష్ణ, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు నాగేశ్వరరావు, షేక్ సైదా, షేక్ బోదులు, షేక్ లాల్ పాషా, షేక్ మహబూబ్ పాషా, షేక్ నజీర్, షేక్ జానీ, షేక్ బడేమియా, గాదె రామచంద్రరావు, గుండా సురేష్, వంగవీటి రమేష్, వంగవీటి సాయి, మార్తి గోపి,గుండా దాము, షేక్ షిలార్, గోళ్ల దామోదర్, సత్యాల విజయ లక్ష్మీ, కణతాల లీలావతి,సత్యాల స్వప్న, షేక్ షమీమ్, షేక్ సఫియా, గోళ్ల కవిత తదితరులు పాల్గొన్నారు.

# యూపిఐ చెల్లింపులపై రుసుము రద్దు చేయాలి




**-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** డిజిటల్ ఇండియా పేరుతో డిజిటల్, యూపిఐ చెల్లింపులపై రుసుములను వెంటనే రద్దు చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో డిజిటల్ చెల్లింపులపై రుసుమును రద్దు చేయాలని కోరుతూ స్థానిక బస్టాండ్‌లో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్బంగా సిపిఐ, ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ డిజిటల్‌పై రుసుము పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధానం ప్రకారం రెండువేలకు మించిన లావాదేవీలపై 0.4 శాతం, 75వేలకు మించిన లావాదేవీలపై గరిష్టంగా రూ.300ల వరకు రుసుము విధిస్తున్నారని వారు తెలిపారు. అయితే ఈ కొత్త విధానం భవిష్యత్తులో తీవ్ర ప్రభావం చూపుతుందని పెనుభారంగా మారే అవకాశం ఉందన్నారు. వ్యాపారులపై భారాన్ని విధిస్తే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వినియోగదారులు భరించాల్సిందేనని వారు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దీనిని తక్షణం ఉపసంహరించుకోవాలని లేదంటే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా ఇంచార్జి కొండపర్తి గోవిందరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, మామిడాల కిరణ్, ఇంద్రసేన, మనోజ్ పాల్గొన్నారు.

# జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

**-బిసిల లెక్క తేల్చాల్సిందే : తాటి**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. 2027లో చేపట్టబోయే జనగణనలో బిసిల కుల గణన చేయాలని ఆయన కోరారు. ఖమ్మం నగర పరిధిలోని 14, 15 డివిజన్లలో బిసి హక్కుల సాధన సమితి మహాసభ బొమ్మిశెట్టి రామనాథం అధ్యక్షతన జరిగింది. మహాసభలో తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల జనాభాను లెక్కించడంలో పాలక వర్గాలు నిర్లక్ష్యాన్ని వివక్షను చూపుతున్నాయన్నారు. బిసి జనాభా తేలకపోవడంతో అటు చట్టసభల్లోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనూ బిసిలకు అన్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. పాలక వర్గాలు బిసిల పట్ల కపట ప్రేమను వలకబోస్తున్నాయి తప్ప సరైన పద్ధతిలో వ్యవహరించడం లేదని తాటి ఆరోపించారు. బిసి హక్కుల సాధన సమితి జిల్లా మహాసభ నవంబర్ 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతుందని ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ మహాసభలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పగడాల మల్లేష్, నాయకులు రావుల హన్మంతరావు, మురళీ, తిరపతయ్య, బాలకోటి, వలరాజు, సారయ్య, శ్రీరాములు, ఉపేందర్ పాల్గొన్నారు. ఈ మహాసభల్లో 14వ డివిజన్ అధ్యక్షునిగా పగడాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కట్టంగూర్ సోమయ్యను, 15వ డివిజన్ అధ్యక్షులుగా ముప్పారపు వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా రాము లను ఎన్నుకున్నారు.

# అనుమానాస్పదంగా బాలిక మృతి

**-మృతదేహంపై గాయాలు**
**-విచారణ చేపట్టిన సీఐ శ్రీలక్ష్మి**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. జూలూరుపాడు మండలం వెంగన్న పాలెం గ్రామానికి చెందిన ఇంద్రపల్లి హరిణి (18) తన నివాస పరిస ప్రాంతంలో మృతి చెందిన ఘటన మిస్టరీగా మారింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సతీష్, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు సంతానం కాగా హరిణి, గ్రేస్ నర్సింగ్ కాలేజీ తనికెళ్ళలో ద్వితీయ సంవత్సరం హాస్టల్ లో వుంటూ చదువుతుతుంది. తండ్రి సతీష్ గత ఐదు సంవత్సరాల క్రితం అనారోగ్య కారణంగా మృతి చెందగా, తల్లి రాజేశ్వరి కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను చదివించుకుంటూ వెంగన్నపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల సుమారు తొమ్మిది రోజుల క్రితం హరిణి మేనత్త అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో మేనత్త కర్మలు బుధవారం జరగడంతో హరిణి హాస్టల్ నుండి వెంగనపాలెం గ్రామానికి వొచ్చింది. ఇదిలా ఉండగా మంగళవారం తల్లీ రాజేశ్వరి పనులు ముగించుకొని ఇంటికి రాగా కూతురు హరిణి ఎంతకీ కనిపించకపోవడంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశీలించగా తన ఇంటి బాత్రూం వెనకాల అనుమానస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని గమనించారు. మృతి దేహం పై గాయాలు ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. సంఘటనపై సమాచారం అందుకున్న జూలూరుపాడు సీఐ శ్రీ లక్ష్మి , ఎస్సై జీనత్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా బాలిక ఒంటిపై గాయాలు తోపాటు బట్టలు లేకపోవడంతో, గుర్తుతెలియని వ్యక్తి బాలికను హత్య చేసి బాత్రూం వెనకాల పడేసి వెళ్లినట్లు ఆరోపణలు రాగా ఆ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఐకేఎంఎస్ మహాసభల విజయానికి భారీ ట్రాక్టర్ ర్యాలీ




**ప్రజాపక్షం/ఇల్లందు:** ఈనెల 28,29,30 తేదీల్లో ఖమ్మంలో జరిగే ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇల్లందు పట్టణంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కొమరారం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాల మీదుగా ఆమ్ బజార్ వరకు సాగింది. కొత్త బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో ఏఐకేఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జేవీ చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ రైతు, కూలీలు ఏకమై ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని, విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్ట బిల్లు, నూతన అటవీ హక్కుల నిబంధనలను ఉపసంహరించుకోవాలని కోరారు. మహాసభల్లో రైతులు, కూలీలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, ఆవునూరి మధు, కొమరం సత్యనారాయణ, పూనెం రంగన్న, కల్తి వెంకటేశ్వర్లు, రాసుద్దీన్, కొప్పుల శ్రీను, మోకాళ్ల రమేష్, వాంకుడోత్ సరోజినీ, రావూరి ఉపేందర్, అటికం శేఖర్, బొగ్గారపు రాజు, వేంపెల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో మంత్రి పొంగులేటి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని గాంధీచౌక్‌లో శ్రీ లక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపానికి చేరుకున్న మంత్రికి ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు సాంప్రదాయబద్ధంగా శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ చైర్మన్ గంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, జిల్లా నాయకులు మిట్టపల్లి నాగి, కౌన్సిలర్లు మోర్ శ్రీకాంత్, ధీరావత్ వెంకటేశ్వర్లు, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దార్న రాజశేఖర్, జాలాది రామకృష్ణ, ఐలూరు మోహన్‌రెడ్డి, టెలికం అడ్వైజరి డైరెక్టర్ మచ్చా రామారావు, జవ్వాజి నాగరాజు, లక్ష్మి బాయి, సర్పంచ్‌లు జవ్వాజి అశ్విని,లక్కిరెడ్డి నాగలక్ష్మి , రేచర్ల వెంకటేష్, బిడికె.రత్నం, రహీం, కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# శాంతినగర్‌లో మహా అన్నదానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 20వ వార్డు శాంతినగర్ ఎస్టీ కాలనీలో శ్రీవెంకటేశ్వర వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా సంతర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి హెల్త్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్ బాబు హాజరైన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం అన్ని దానాల్లోకెల్లా మహాదానమని, భగవంతుడు ప్రసాదించిన సంపదలో కొంత భాగాన్ని సమాజంతో పంచుకోవడం నిజమైన మానవత్వానికి నిదర్శనమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ నాయకులు తేజావత్ నాగేశ్వరరావు, బాలమ్మ, రాజా, తిరుపతమ్మ, కృష్ణబాబు, కుసుమ, జాలా మహాలక్ష్మి , ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# సామూహిక సీమంతాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోషణ మాసం సందర్బంగా సామూహిక సీమంతాల వేడుకను ఘనంగా నిర్వహించారు. మంగళవారం 16వ డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సీమంతాల కార్యక్రమానికి డిడబ్ల్యూవో ప్రమీల, సిడిపివో వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ సిహెచ్ విజయలక్ష్మి , మాజీ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిడబ్ల్యూవో ప్రమీల మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి. అనిత, ఎ. ఉమా జగదీశ్వరి, జి. సరోజిని, సిహెచ్ పద్మ, బి. ధనలక్ష్మి , జి. కృష్ణవేణి, ఆయాలు , ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

# డప్పు కళాకారులకు టీషర్టులు పంపిణీ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడు జక్కంపూడి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం మంగళవారం డప్పు కళాకారులకు జక్కంపూడి కిషోర్ టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జక్కంపూడి కృష్ణమూర్తి జ్ఞాపకార్థంగా ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, ఓబిసి సెల్ ఉపాధ్యక్షుడు కోసూరు వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ దిరిశాల నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, పగడాల లచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా కమిటీ ముఖ్య నాయకులు, సర్పంచుల, ఉపసర్పంచుల కార్యకర్తలు, కళాకారులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ తల్లాడ :** వ్యవసాయ మార్కెట్ కమిటీ వైరా పరిధిలోని తల్లాడ సబ్ యార్డులో మల్లవరంలో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని వైరా మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోళ్ల గంగారావు, వైస్ ఛైర్మన్ కాపా సుధాకర్, మల్లవరం సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్ లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మిర్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి తమ పంటను విక్రయించుకోవాలని వారు సూచించారు. మిర్చి నాణ్యత, తూకం, ధర నిర్ణయం తదితర అంశాలలో రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం మార్కెట్ కమిటీ అధికారులు ఛైర్మన్ గంగారావు, వైస్ ఛైర్మన్ సుధాకర్, మల్లవరం సర్పంచ్ కిరణ్ కుమార్ లను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు , సిబ్బంది, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.